**కథ**

కాసోవార్ అనిల్ కుమార్

# పాపం సుబ్బారావు

**మరొక్కమారు తన 'వాచ్'లో టైం చూసాడు సుబ్బారావు. ఉదయం 6.30 కావస్తున్నది. నైట్ డ్యూటీ ముగిసి అర గంట గడిచింది. ఇంకా తన రిలీవర్ రాలేదు. ఛ! ఏం ఉద్యోగమో? తనేం కావాలనుకున్నాడు? టిప్‌టాప్‌గా సూటు బూటు వేసుకు తిరిగే మెడికల్ రిప్రెజెంటేటివ్ కావాలనుకున్నాడు. కాని రాత్రనక, పగలనక డ్యూటీ చేయవలసిన కార్మికుడినయ్యాను.**

స్కూటర్ హార్న్‌తో ఈ లోకంలోకి వచ్చిన సుబ్బారావు ''ఏరా మనోహర్ లేటయ్యిందేం?''

''చలికాలం కదరా..ఓ పట్టాన లేవాలన్పించదు.. ఇంతకీ కంప్రెసర్‌ల పొజిషన్ ఏంటి?''

''ఏ, బిలు రన్నింగ్ నార్మల్. సి, డిలు రడీగా ఉన్నాయి'' చెప్పేసి షెడ్డులోంచి సైకిలు తీసుకొని ఇంటికి బయలుదేరాడు.

సైకిలు పాతదైపోయింది. రిపేరులతో వెళ్ళదీస్తున్నాడు. 'ఈ సంవత్సరమైనా స్కూటర్ కొనాలి. తన కోసం కాకపోయినా తన భార్య సుబ్బులు కోరకైనా కొనాలి. తన ప్రియమైన భార్య సుబ్బులు చిన్న కోరిక కూడా తీర్చలేకపోతున్నాడు. తనకు మాత్రం స్కూటరు కొనాలని లేదా? ఎక్కడా ఏ నెల జీతం ఆ నెలే ఖర్చవుతుండగా ఎలా సాధ్యవౌతుంది? ఈమారు..అప్పు చేసైనా సరే స్కూటర్ కొనాలి. స్కూటర్‌పై తను, తన సుబ్బులు వెనక నుండి నా నడుము చుట్టూ చేయి వేసి పట్టుకుంటే అలా వెళ్తుంటే కలిగే ఆనందం..పెళ్ళయిన నాటి నుండి ఇవే కలలు ఇప్పటికే ఆరు వసంతాలు గడిచిపోయాయి. బ్యాంకు బ్యాలెన్సు పెరగలేదు. కాని పిల్లల సంఖ్య ఇద్దరికి చేరుకుంది. పిల్లలిద్దరే అల్లరిలో వంద మందితో సమానం. పిల్లల అల్లరిలో సుబ్బులు తన కోరికను మర్చిపోయిందేమో? ఏది ఏమైనా ఈ నెలలో తప్పకుండా కొనాలి' ఇలా అనుకుంటూనే సుబ్బారావు సైకిలుతో పాటు క్రిందపడిపోయాడు.

''సుబ్బారావు..సుబ్బారావు లేరా! దెబ్బలేమైనా తగిలాయా?'' అంటూ లేవడానికి చేయందించాడు వాసుదేవ్.

''లేదు లేరా..ఏదో ఆలోచిస్తూ..నీ సైకిలుకు గుద్దుకున్నాను. నీకేం కాలేదుగదా?''

''లేదులే..జాగ్రత్తగా వెళ్ళు మరి''

''అలాగేలే..''

ఇల్లు చేరుకున్న సుబ్బారావు సుబ్బులు కేకతో వాకిట్లోనే ఆగిపోయాడు. ''ఆ సైకిలు వాకిట్లోనే ఉంచండి'' అన్న వాక్యం అతని చెవుల్లో ప్రతిధ్వనించింది.

''ఏమిటీ పొద్దున్నే మొదలెట్టావ్! ఈ సైకిల్ లోనబెడితే ఏమవుతుందట?''

''నాకేది కాదు కాని, ఆ డొక్కు సైకిలు బయటే ఉంచితే మీకేమవుతుంది?''

''ఏమిటే నా సైకిలు డొక్కు సైకిలా? మరోమారన్నావంటే నిన్నేం చేస్తానో నాకే తెలియదు''

''ఒక్కమారు కాదు వంద మార్లంటాను ఏం చేస్తారేంటి?'' ఓ అడుగు ముందుకేసింది సుబ్బలక్ష్మి.

సుబ్బారావు అక్కడే ఆగిపోయాడు. పరిస్థితి విషమించేలా ఉంది. వెనుదిరిగి సైకిలు దగ్గరికి చేరుకుని దాని దగ్గర కూర్చున్నాడు.

''అసలు నీ విలువ సుబ్బులుకేం తెలుసు? నీవు మా తాతయ్య, మా నాన్నలకే కాకుండా నాకు కూడా సేవలందిస్తున్నావు'' అంటూ, ఆప్యాయంగా సైకిలును తడుముతున్నాడు.

''రేప్పొద్దున్న మీ వంశోద్ధారకుడికి గూడా సేవ చేస్తుంది లెండి'' అంటించింది సుబ్బులు.

''సుబ్బులూ..'' గట్టిగా అరిచాడు.

''ఆ..ఏం చేస్తారేం?''

''ఏం చేస్తానా?'' పిడికిళ్ళు బిగుసుకున్నాయి సుబ్బారావుకు.

''పాలు పట్టండమ్మా'' అన్న కేకతో ఇద్దరు చెరోవైపు విడిపోయారు.

''ఏమిటీ! పాలు రోజు రోజుకీ పలుచనవుతున్నాయి?''

''ఏంటమ్మా..మీరొక్కరేనా పాలు పోయించుకునేది.. బి టైపు, సి- టైపులలో కూడా పోస్తానమ్మా. ఒక్కరు కూడా పాలు పలుచన అని అనలేదు''

''నేనేమన్నాను రంగయ్యా! పాలు ఇదివరకటిలా లేవే అన్నాను.''

''ఎలా ఉంటాయమ్మా? మన ఏరియాలో ఎండలెక్కువ. ఈ చలికాలంలో కూడా ఎండలు మండిపోతున్నాయి. మీకు తెలియందేముంది? ఇంత చిక్కటి పాలు మీకు ఎవరు పోయరమ్మా''

పోసేవి నీళ్ళ పాలు పైగా దబాయింపు. సుబ్బులు పాల గిన్నెతో లోనికెళ్ళినా సుబ్బారావుకు పాలవాడిపై ఒకింత కోపమొచ్చింది. వీడిని మాన్పించి మరొకడిని కుదుర్చుకుందామంటే వీలుగాకుండా ఉంది. పాలు పోసే వాళ్ళు యూనియన్ పెట్టుకున్నారు. ఆ యూనియన్‌కి రంగయ్య నాయకుడు. కోపమొచ్చినా దిగమింగుకున్నాడు సుబ్బారావు.

''సుబ్బులూ..సుబ్బులూ''

''ఏమిటీ?''

''కాఫీ''

''మీ ముందేగా పాలు పట్టాను. అవి వేడి కావాలా వద్దా? ఎక్కడా తొందరే! అస్సలోపిక లేదు''

'అవును నాకెందుకుంటుంది ఓపిక? నిన్ను కట్టుకోకముందుండేది. నీవు వచ్చావు అన్నీ పోయాయి' ఇవన్నీ అనాలనుకున్నాను సుబ్బారావు మాటలు పెదవి దాటలేదు. సుబ్బలక్ష్మి కాఫీతో ఎదురుగా నిల్చుంది.

''కాఫీ..బాగుంది..సుబ్బులూ..''

సుబ్బలక్ష్మి సంతోషంతో వెనుదిరిగింది.

''పిల్లలు లేవలేదా?''

''లేదు పడుకునే ఉన్నారు''

''పొద్దున్నే లేపకపోయావా? పరీక్షలు దగ్గర్లోనే ఉన్నాయి''

''నాకు ఇంటి పనితోనే సరిపోతోంది. ఇటు

వంట..అటు అంట్లు..''

''ఆపు సుబ్బులు..'' విసుక్కుంటూ బెడ్‌రూమ్‌లోకి నడిచాడు సుబ్బారావు.

''లేవండిరా'' దుప్పటి లాగేశాడు సుబ్బారావు.

''ప్లీజ్ డాడీ..ఒక్క ఐదు నిమిషాలు''

''నో ఐదు నిమిషాలు కాదు కదా ఐదు సెకన్లు కూడా పడుకోనివ్వను'' లేపి కూర్చోబెట్టాడు.

''గుడ్ మార్నింగ్..డాడీ'' కూడబలుక్కున్నట్లు ఇద్దరూ ఒకేసారి చెప్పారు.

లోలోపల గర్వంగా ఫీలయినా పైకిమాత్రం కోపం నటిస్తూ ''హోం వర్క్‌లుంటే పూర్తి చేయండి.'' అన్నాడు సుబ్బారావు.

''డాడీ..నా మాథ్స్ హోం వర్క్ చేసి పెట్టరా'' అంటూ కొడుకు చింటూ గారాలు పోయాడు.

''డాడీ నాకు ఇండియా పటం వేయటం రావట్లేదు ప్లీజ్ వేసివ్వరా'' కూతురు స్వీటీ మారాం చేసింది.

అసలే నైట్ డ్యూటీ చేసి అలసిపోయిన సుబ్బారావుకు చిర్రెత్తుకొచ్చింది. పిల్లల్ని అలానే వదిలేసి బయటకొచ్చాడు.

''మీకెన్నిసార్లు చెప్పినా వినిపించుకోరు. డ్యూటీ నుండి రాగానే విడిచేసిన డ్రెస్ బయటనే వేయాలి. వేస్తారా..వేయరు..తండ్రి ఎంతో పిల్లలంతే నా జీవితమంతా మీ బట్టలు సర్దడానికే సరిపోతుందేమో?''


''సుబ్బులు ఆపుతావా నీ దండకం''

''అనండి..అనండి..నేనేమైనా మంచి విషయాలు చెబితే అది దండకమా? ఎవరి కొరకండీ...ఇల్లు శుభ్రంగా ఉంటే..ఇరుగుపొరుగు సుబ్బారావు ఇల్లెంత నీట్‌గా ఉందంటారే కాని సుబ్బలక్ష్మి ఇల్లనరుగా? నేనేమైనా చెబితే నన్నే విసుక్కుంటారు మీరు. అసలు మిమ్మలను కాదండి. మా నాన్నను అనాలి. ఈ పెళ్ళి నాకిష్టం లేదు వద్దు మొర్రో అన్నాను వినిపించుకోకుండా, 'అమ్మా సుబ్బలక్ష్మీ! నీవు నా మేనల్లుడి సుబ్బారావు కొరకే జన్మించావు. నీ పేరు సుబ్బలక్ష్మి అని మీ అత్తగారే పెట్టారు' అంటూ మీకు కట్టబెట్టారు. అలా కాకుండా ఏ డ్క్టరుకో, ఏ ఇంజనీర్‌కో ఇచ్చి ఉంటే హాయిగా కాలుమీద కాలు వేసుకుని మహారాణిలా గడిపేదాన్ని'' ఉబికి వస్తున్న కన్నీటిని అదుపుచేస్తూ కుర్చీలో కూలబడింది సుబ్బలక్ష్మి.

''ఇపుడు నీకేం తక్కువయిందే? నిన్ను పూలల్లో పెట్టి చూసుకుంటున్నానుగా''

''ఆ..అదొక్కటే తక్కువ. ఎందుకండీ అబద్ధాలు? ఎన్నడైనా మూరెడు మల్లెదండ తెచ్చారా? ఎదురింటి అప్పారావు చూడండి. రోజు సాయంత్రం అయ్యేసరికి పూల చెండుతో వస్తాడు. ఊ.. మీరూ వున్నారు..ఎందుకు?''

''సరేలే. ఇవన్నీ రోజూ ఉండేవేగా. కూరగాయలేం తేవాలో చెప్పవోయ్..'' అంటూ సంచీ తీసుకున్నాడు.



''నే చెప్పినవి ఎన్నడైనా తెచ్చారా ఏంటీ? ఈరోజు క్రొత్తగా అడుగుతున్నారు. మీ ఇష్టం వచ్చినవే తీసుకురండి. హవ్వ! ఇరుగుపొరుగు చూస్తే..సుబ్బలక్ష్మి భర్త కూరగాయలు కూడా భార్యనడిగే తెస్తాడు- అని అనుకోవడానికా? మీ ఇష్టం వచ్చినట్టు మీరు నడుచుకుంటారు. అదే మా అన్నయ్యలను చూడండి. మా వదినలెంత చెబితే అంత! నా ఖర్మ ఇలా తగలబడిపోతే మీరేం చేస్తారులేండి'' అంటూ వాకిలి వైపు తిరిగిన సుబ్బులు ఆశ్చర్యపోయింది. అప్పటికే సుబ్బారావు రోడ్డు దాటేసి వడివడిగా అడుగులేస్తున్నాడు.

''ఆంటీ..ఆంటీ..'' గట్టిగా పిలిచాడు పక్కింటి రామారావు కొడుకు సోము.

''ఆ..ఏమిటి?'' సోమును చూడగానే విసుక్కుంది. వారపత్రిక వచ్చిన రోజే అడిగి పట్టుకెళ్తాడు వాళ్ళమ్మకోసం. పత్రిక వచ్చిన రోజే చదవాలనుకుంటే కొనుక్కోవచ్చుగా.

''ఆంటీ..మా అమ్మ ఈ వారం ఆంధ్రభూమి ఇవ్వమంది''

''ఏం తెలంగాణా భూమి చదువరా?''

''లేదాంటి మా అమ్మ 'ఆంధ్రభూమి' మాత్రమే చదువుతుంది''

'నా ఖర్మ' మనసులోనే అనుకుని ''సాయంకాలం తెచ్చివ్వాలి. పత్రిక ఈరోజే వచ్చింది'' అంది.

పిల్లలకు స్నానాలు పోసి, టిఫిన్ తినిపించి స్కూల్‌కు రడీ చేసింది. మార్కెట్‌కెళ్ళిన సుబ్బారావు ఇంకా రాలేదు. రిక్షా రాగానే పిల్లలను బడికి పంపింది.

సుబ్బారావు సుబ్బలక్ష్మికి తెలియకుండా సిగరెట్ కాలుస్తాడు. కూరగాయలు కొన్న తర్వాత స్నేహితులతో మాట్లాడుతూ టైం మర్చిపోయాడు. సుబ్బులుకు కోపమొస్తుందని గబగబా ఇంటికి బయలుదేరాడు. చేతిలో సిగరెట్టున్న సంగతి మర్చిపోయాడు.

''ఏంటి మళ్లీ అంటించారు'' కోపంగా అడిగింది.

''ఏమిటే అంటించానంటున్నావు! ఎవరి కొంపలైనా అంటుకున్నట్టు కలగన్నావా?''

''నా జీవితానికి ఇక కలతేగా మిగిలాయి''

''పిల్లల్ని కంటానంటే నే వద్దన్నానా?''

''ఆ..అదొక్కటే తక్కువ..ఉన్న పిల్లలకు మంచి బట్టలు కొనలేరు..నాకొక పట్టుచీర కొనలేరు కానీ ఇంకా పిల్లల్ని కంటాడట.''

వీక్ పాయింట్ పై దెబ్బ తగిలేసరికి సుబ్బారావు బాత్రూంలోకి దూరాడు.

''సుబ్బులూ'' బాత్రూంలోంచి అరుపు.

''ఏంటండీ?''

''నీకెన్నిమార్లు చెప్పాను.. మగ్‌లో కుంకుడుకాయల రసం పోయవద్దని''

''ఏమైందండీ''

''నీళ్ళనుకొని మొహం మీద పోసుకున్నాను. కళ్ళు మండుతున్నాయి''

''అబ్బ.. ఇంత చిన్న విషయానికే అంత గట్టిగా అరవాలా?'' అంటూ వేరే మగ్ అందించింది.

బాత్రూంలోంచి బయటపడ్డ సుబ్బారావు నెమ్మదిగా సుబ్బులందించిన ఉప్మా తింటున్నాడు.

సుబ్బారావు తెచ్చిన కూరగాయలు చూసిన సుబ్బులు కోపం ఆపుకోలేకపోయింది.

''మళ్లీ ఆ రంభ దగ్గరే కొన్నారా కూరలు''

''అవును నీకెలా తెల్సిందే?''

''కూరలను చూస్తే తెలుస్తుంది. ముదిరిపోయినవి, పాడయినవి అన్నీ మీలాంటి వారికంటగడ్తుంది. మీకెన్నిసార్లు చెప్పాను ఆమె దగ్గర కొనవద్దని''

''ఏమిటోనే ఆమె దగ్గరికెళ్ళేసరికి కాళ్ళు వాటంతట అవే ఆగిపోతాయి''

''ఛీ! ఇదేం పాడుబుద్ధండీ? పెళ్ళయిందీ..ఇద్దరు పిల్లలు హవ్వ!''


''అనుమానిస్తున్నావా? సుబ్బులూ''

''లేదు. ఆరాధిస్తున్నాను''

''ఎంత తియ్యటి మాట చెప్పావు మై స్వీటీ''

''ఏం ఈమధ్య తెలుగు సిన్మాలు ఎక్కువ చూస్తున్నారా?''

''ఎందుకొచ్చింది అనుమానం?''



''మీ డైలాగులు వింటుంటే''

''హమ్మయ్య నీవైనా నన్ను రచయితగా గుర్తించావు''

''గుర్తించక చస్తానా? జీవితాంతం మీతో గడపాలాయే''

''నీ ఉద్దేశ్యమేంటే? విడాకులు తీసుకుందామనా?''

''అంత సులభంగా దొరకవుగా''

''సులభంగా దొరికితే పుచ్చుకుందామనేనా?''

## పాపులార్టీ

**కొంతమంది తారలు తమ మాతృదేశంతో పాటూ ఇతర దేశాల్లో కూడా చాలా పాపులర్ అయిపోతారు. ఇప్పుడు కరిష్మా వంతొచ్చినట్టుంది. మన పొరుగదేశమైన పాకిస్తాన్‌లో ఆమె పేరు మారుమ్రోగిపోతోంది. సహారా మనోరంజన్ సీరియల్ 'కరిష్మా-మిరాకిల్స్ ఆఫ్ డెస్టినీ'లో నటిస్తున్న కరిష్మా ఇప్పుడు పాకిస్తాన్ ప్రేక్షకులకి కూడా కనువిందు చేయనుంది. ఈ సీరియల్ శాటిలైట్ హక్కుల్ని సహారా వారు పాకిస్తానీ ఛానెల్ ఎఆర్‌వై గోల్డ్‌కి అమ్మేశారట. త్వరలో ఈ సీరియల్‌లో అక్కడ కూడా దర్శనం ఇవ్వనుందిట.**

రెట్టించాడు సుబ్బారావు.

''అనువమానవమా?'' ఈమధ్యనే ఫెమినిస్టుల మీటింగులకు వెళ్ళి వచ్చింది. అందుకే ధైర్యంగా ఎదురు ప్రశ్న వేసింది.

''ఛ! ఛ! వెధవకొంప..వెధవ కొంప..ఎప్పుడూ గొడవలే.. ఒక్కనాడన్నా మనశ్శాంతిగా ఉండనివ్వవుగా''

''గొడవ చేసింది మీరా? నేనా?''

'పోస్ట్' పోస్ట్‌మాన్ కేకతో సర్దుకున్న సుబ్బారావు, సుబ్బలక్ష్మి ముందుగదిలోకి వచ్చారు.

కవరందుకుంది సుబ్బలక్ష్మి.

''ఏమండీ మీ కథ తిరిగొచ్చింది''

''ఏ కథ చూడవోయి''

కవరు లోంచి పేపర్లు బయటకు తీసిన సుబ్బలక్ష్మి కథ టైటిల్ చూసి నవ్వాపుకోలేకపోయింది. నవ్వుతూనే కథతో పాటే తనూ అతని చేతుల్లో ఒదిగిపోయింది.

ఆ కథ మరేదో కాదు 'భార్యాభర్తల అనుబంధం'. ❀